క్లుప్తంగా

అమ్మవారికి పంచామృతాభిషేకం



కనకమహాలక్ష్మి అమ్మవారికి పంచామృతాభిషేకం చేస్తున్న అర్చకులు

చీపురుపల్లి: స్థానిక కనకమహాలక్ష్మి ఆలయంలో అమ్మవారికి అర్చకులు ఆదివారం పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అమ్మవారికి ప్రతీ ఆదివారం అభిషేకాలతో పాటు ప్రత్యేక పూజలు, అలంకరణ నిర్వహిస్తూ వస్తున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ ఇప్పిలి గోవింద, వైస్ చైర్మన్ సూరు కుమార్‌ల ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

డీపట్టా భూముల పరిశీలన



డీపట్టా భూముల రికార్డులను పరిశీలిస్తున్న ఆర్డీఓ అప్పారావు

గుర్ల: మండలంలోని దమరసింగిలో డీపట్టా భూములను చీపురుపల్లి ఆర్డీఓ అప్పారావు ఆదివారం పరిశీలించారు. డీపట్టా భూములు ఎవరి ఆధీనంలో ఉన్నాయో విచారణ చేసి, రికార్డులను పరిశీలించారు. రికార్డులు సక్రమంగా ఉంటేనే ఆన్‌లైన్ చేయాలని వీఆర్‌ఓలను ఆదేశించారు. ఏమైనా సమస్యలు ఉంటే తమదృష్టికి తీసుకురావచ్చని రైతులకు సూచించారు.

ఎస్.వి.రమణరాజు పుట్టినరోజు వేడుకలు



కేక్ కట్‌చేస్తున్న రమణరాజు

మెరకముడిదాం: డీసీఎంఎస్ మాజీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ నాయకుడు ఎస్.వి.రమణరాజు పుట్టినరోజు వేడుకలను సోమలింగాపురంలోని ఆయన నివాసంలో పార్టీ నాయకులు, అభిమానులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. రమణరాజుకు శుభాకాంక్షలు తెలిపి, ఆయనతో కేక్ కట్ చేయించారు. అనంతరం 50 మంది పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. మండల నాయకులు తాడ్డి వేణుగోపాలరావు, కె.ఎస్.ఆర్.కె.ప్రసాద్, కోట్ల విశ్వేశ్వరరావు, వైస్ ఎంపీపీ టి.హరిబాబు, పప్పల కృష్ణమూర్తి, ఎస్.సీతారామరాజు, ఎస్.కృష్ణమూర్తిరాజు, పలువురు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

జె.గుమడాంలో పారిశుద్ధ్య పనులు



పారిశుద్ధ్య పనులు చేస్తున్న కార్మికులు

బొండపల్లి: మండలంలోని జె.గుమడాం గ్రామంలో సర్పంచ్ మంత్రి చిన్నమ్ములు ఆదివారం పారిశుద్ధ్య పనులు చేయించారు. పారిశుద్ధ్య కార్మికులు గ్రామంలోని అన్ని వీధి కాలువల్లో చెత్తతో పాటు,రక్షిత మంచినీటి పథకం వద్ద తుప్పలను తొలగించారు.ఆర్‌డబ్ల్యూఎస్ జేఈఈ సంతోష్‌కుమార్, వైఎస్సార్‌సీపీ నాయకుడు మంత్రి గోవింద పనులను పర్యవేక్షించారు.

ఫార్మసీ రంగంలో అపార అవకాశాలు



విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తున్న ప్రొఫెసర్ ఈశ్వరప్రసాద్

మెంటాడ(గజపతినగరం రూరల్): భవిష్యత్ అంతా ఫార్మసీ రంగానిదేనని, ఫార్మసీ కోర్సులు చేసిన వారికి అపారమైన ఉపాధి అవకాశాలున్నాయని ఆంధ్రా యూనివర్సిటీ ఫార్మసీ కళాశాల ప్రొఫెసర్ కె.ఈశ్వరప్రసాద్ అన్నారు. గజపతినగరం మండలంలోని సీతారామపురం గ్రామంలోని శ్రీసాయి ఫార్మసీ కళాశాల వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. అతిథిగా హాజరైన ప్రొఫెసర్ ఈశ్వరప్రసాద్ మాట్లాడుతూ ప్రస్తుతం అత్యంత వేగంగా ఉపాధి అవకాశాలు కల్పిస్తున్న రంగం ఏదైనా ఉందంటే అది ఫార్మసీ రంగమేనని అన్నారు. వార్షికోత్సవంలో భాగంగా విద్యార్థులకు వివిధ ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ కె.లక్ష్మీదీప్తి, అధ్యాపకులు కె.వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక సందడి



చీపురుపల్లి: రామాంజనేయకాలనీలో వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నృత్య ప్రదర్శనలు



లక్కవరపుకోట: చందులూరులో పశలమ్మ గుడివద్దకు పశువులను తీసుకొచ్చిన రైతులు



కొత్తవలస: తుమ్మికాపల్లిలోని వినాయక మండపం వద్ద విద్యాగణపతికి పూజలు చేస్తున్న బాలబాలికలు



జామి: ఆర్.బి.పురంలో పశలమ్మ తల్లి గుడి వద్ద మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు



వేపాడ: పశలమ్మ పండగలో భాగంగా బొద్దాంలో అమ్మవారికి, పశువులకు పూజలు చేస్తున్న భక్తులు



లక్కవరపుకోట: కళ్లేపల్లిలో వినాయక మండపం వద్ద భక్తులకు అన్నప్రసాదం వడ్డిస్తున్న ఎంపీపీ శ్రీనివాసరావు, తదితరులు



వేపాడ: వేపాడలో శతకం పట్టు వద్ద యూత్ ఆధ్వర్యంలో అన్నదానం



వేపాడ: బానాదిలో వినాయక మండపం వద్ద అన్న సమారాధన

వినాయక నవరాత్రి ఉత్సవాలతో పాటు గ్రామదేవతల పండగల నేపథ్యంలో పల్లెలు, పట్టణాల్లో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. జామి, వేపాడ లక్కవరపుకోట మండలాల్లోని ఆర్.బి.పురం, బొద్దాం, చందులూరు, గొల్జాం గ్రామాల్లో పశలమ్మ తల్లి పండగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామస్తులు అమ్మవారి గుడులు వద్దకు డప్పువాయిద్యాలతో వెళ్లి పసు పు,కుంకుమ చెల్లించి మొక్కులు చెల్లించుకున్నారు. అలాగే పశువులకు పూజలు చేసి, వాటిపై ఉదకం చల్లారు. పంటలు సమృద్ధిగా పండాలని, పశువులు ఆరోగ్యంగా ఉండేలా చూడాలని ఏటా వరినాట్లు పూర్తయిన తర్వాత పశలమ్మ తల్లికి పూజలు చేస్తుంటామని ఆయా గ్రామాల పెద్దలు తెలిపారు. అలాగే వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా లక్కవరపుకోట మండలం కళ్లేపల్లి గ్రామంలో ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదానాన్ని ఎంపీపీ గేదెల శ్రీనివాసరావు ప్రారంభించారు. సర్పంచ్ గోకేడ మునలనాయుడు, నాయకులు నక్క రాజు,తూర్పాటి అప్పలరాజు భక్తులకు ప్రసాదం వడ్డించారు.వేపాడ మండల కేంద్రంలో పాటు ఆ మండలంలోని బానాదిలో వినాయక మండపాలవద్ద అన్నదానం చేశారు.కొత్తవలస మండలంలోని తుమ్మికాపల్లి రైల్వే గేటు వద్ద ఏర్పాటు చేసిన వినాయక మండపంలో బాల, బాలికలు విద్యాగణపతికి పూజలు చేశారు. చీపురుపల్లిలోని రామాంజనేయకాలనీలో వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి నిర్వహించిన నృత్య ప్రదర్శనలు అలరించాయి.

– జామి/లక్కవరపుకోట/వేపాడ/కొత్తవలస/చీపురుపల్లి

జోరుగా 'జగనన్న ఆరోగ్య సురక్ష' సర్వే



గజపతినగరం: పురిటిపెంటన్యూకాలనీలో ఓ కుటుంబ సభ్యులకు వైద్యపరీక్షలు చేస్తున్న వైద్యసిబ్బంది

గజపతినగరం: 'జగనన్న ఆరోగ్య సురక్ష' సర్వే మండలంలో జోరుగా సాగుతోంది. వైద్యసిబ్బంది, వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి ప్రజల ఆరోగ్య సమాచారం సేకరిస్తు న్నారు. గజపతినగరం, పురిటిపెంట మేజర్ పంచాయతీల్లో ఎంఎల్‌హెచ్‌పీలు, ఆరోగ్య, ఆశ కార్యకర్తలు ఆదివారం ఇంటింటికీ వెళ్లి ప్రజలకు బీపీ,సుగర్ తదితర ఏడు రకాల వైద్యపరీక్షలు చేశారు. ఆరోగ్య సమస్యలున్న వారికి టోకెన్‌లు అందజేసి, త్వరలో నిర్వహించనున్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంపులకు హాజరు కావాలని సూచించారు. మెడికల్ క్యాంపుల్లో వైద్యనిపుణులు వైద్యసేవలంది స్తారని, అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేస్తారని సర్వే బృందం తెలిపింది. గజపతినగరం గ్రామసచివాలయం-2 పరిధిలో అక్టోబర్ 4వ తేదీన, సచివాలయం-1 పరిధిలో అక్టోబర్ 5న, పురిటిపెంట సచివాలయం-2 పరిధిలో 6న, పురిటిపెంట సచివాలయం-1 పరిధిలో 7న మెడికల్ క్యాంపులు నిర్వహించనున్నట్లు ప్రజలకు సమాచారం అందించామని ఆరోగ్య కార్యకర్త ఏ.సత్యవతి తెలిపారు.

సర్వే వేగవంతం చేయండి

దత్తిరాజేరు: గ్రామాల్లో 'జగనన్న ఆరోగ్య సురక్ష' సర్వేను వేగవంతం చేయాలని వైద్యసిబ్బంది, వలంటీర్లను ఆదేశించామని ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 30 నుంచి షెడ్యూల్ ప్రకారం గ్రామాల్లో ఆరోగ్య సురక్ష శిబిరాలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.ఈ శిబిరాల నిర్వహణ బాధ్యతల పర్యవేక్షణకు సంబంధించి మండలంలోని 17 సచివాలయాల సిబ్బందిని క్లస్టర్లకు ఇన్‌చార్జ్‌లుగా నియమించామని తెలిపారు.

రూ.90 లక్షలతో రోడ్డు పునరుద్ధరణ



పెదకాద గ్రామానికి వేస్తున్న తారు రోడ్డు

దత్తిరాజేరు: మండలంలోని పెదకాద గ్రామం నుంచి మరుపల్లి వద్ద జాతీయ రహదారి వరకు ఏఎంసీ నిధులు రూ.90 లక్షలతో తారురోడ్డు పునరుద్ధరణ పనులు చేపడుతున్నామని ప్రాజెక్ట్ డీఈ అప్పలనాయుడు ఆదివారం తెలిపారు. రోడ్డు గోతులు తేలి అధ్వానంగా తయారు కావడంతో సమస్యను ఎంపీటీసీ సత్యం,ఉప సర్పంచ్ సామిరెడ్డి ఈశ్వరరావు ఎమ్మెల్యే బొత్స అప్పలనరయ్య దృష్టికి తీసుకువెళ్లారు. రోడ్డును పునరుద్ధరించాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. అధికారులు అంచనాలు తయారు చేసి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించడంతో నిధులు మంజూరయ్యాయి. 3.5 కిలో మీటర్ల మేర రోడ్డు చిప్స్, బెర్మల పనులు పూర్తయ్యాయని, వారం రోజుల్లో తారుపూత పనులను పూర్తి చేస్తామని డీఈ తెలిపారు.

ఆధార్ అనుసంధానం చేసుకోండి

బొండపల్లి: విద్యుత్ మీటర్లు ఉన్న ప్రతి ఒక్కరూ విధిగా తమ విద్యుత్ సర్వీసు నంబర్‌కు ఆధార్‌ను అనుసంధానం చేసుకోవాలని విద్యుత్ శాఖ ఏఈఈ ఆర్.శంకరరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలం వ్యాప్తంగా 15 వేల వరకు గృహ విద్యుత్ కనక్షన్‌లు ఉన్నాయని, ఇంత వరకు సుమారు 10వేల మంది తమ సర్వీసు నంబర్‌కు ఆధార్ అనుసంధానం చేసుకున్నారని తెలిపారు. మిగిలిన వారు త్వరగా అనుసంధానం చేసుకోవాలని సూచించారు. విద్యుత్ శాఖకు సంబంధించిన యాప్‌లో కానీ, సచివాలయ జేఎల్‌ఎంల వద్ద కానీ అనుసంధానం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

సమష్టి కృషితో అభివృద్ధి



గంట్యాడ: ఎంపీపీ హైమావతికి పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలియజేస్తున్న ఎంపీటీసీలు



బొండపల్లి: కేక్ కట్ చేస్తున్న ఎంపీపీ చలంనాయుడు, జెడ్పీటీసీ సూర్యప్రకాశరావు

గంట్యాడ: ప్రజాప్రతినిధులు, అధికారుల సహకారంతో మండలాభివృద్ధికి కృషి చేస్తున్నామని ఎంపీపీ పీరుబండి హైమావతి తెలి పారు. ఎంపీపీగా హైమావతి బాధ్యతలు స్వీకరించి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అధి కారులు, ప్రజాప్రతినిధులు ఆదివారం అభినందన సభ నిర్వహించారు. ఎంపీపీని ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, నాయకులు, అధికారులు సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గత రెండేళ్లలో మండలంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని చెప్పారు.గ్రామాల్లో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా బోర్లు ఏర్పాటు చేశామని తెలిపారు. పార్టీలకు అతీతంగా పథకాలు అందించాలన్న ముఖ్య మంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తున్నామని తెలిపారు. జెడ్పీటీసీ వర్రి నరసింహమూర్తి , జిల్లా వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పీరుబండి జైహింద్‌కుమార్, వైస్ ఎంపీపీ సుంకరి సుజాత, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రంధి రాము, జేసీఎస్ కన్వీనర్ రామసూర్యం, సీనియర్ నాయకులు నారాయణమూర్తి రాజు, ఎంపీడీఓ భానోజీరావు తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా సేవలందిస్తున్నాం..

బొండపల్లి: పార్టీలతో సంబంధం లేకుండా పారదర్శకంగా సేవలు, పథకాలు అందిస్తున్నామని ఎంపీపీ చల్లా చలం నాయుడు అన్నారు. ఎంపీపీగా బాధ్యతలు చేపట్టి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా ఆయనతో పాటు జెడ్పీటీసీ రాపాక సూర్యప్రకాశరావును స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీటీసీలు,సర్పంచ్‌లు, మండల అధికారులు ఆదివారం సన్మానించారు. ముందుగా ఎంపీపీ, జెడ్పీటీసీతో కేక్ కట్ చేయించారు. ఎంపీడీఓ వై.వి.రాజేంద్రప్రసాద్, పూర్వ ఎంపీడీఓ వేదవతి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బొద్దల చిన్నంనాయుడు, వైస్ ఎంపీపీలు మీసాల సరోజిని, గొండేల ఈశ్వరరావు, గొట్లాం, రాచకిండాం పీఏసీఎస్‌ల చైర్మన్‌లు మహంతి రమణ, గొల్లు సతీష్, మీసాల తులసీరాం తదితరులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలి



విద్యార్థినులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న వార్డెన్, తదితరులు

చీపురుపల్లి: విద్యార్థులు, యువత సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని ప్రభుత్వ బాలికల కళాశాల వసతిగృహ సంక్షేమాధి కారి యశోధ అన్నారు. జాతీయ సేవా పథకం దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రభుత్వ ఆదర్శ డిగ్రీ కళాశాల ఆవరణలోని బాలికల కళాశాల హాస్టల్ విద్యార్థినిలకు జాతీయ సేవా పథకంపై ఆశయ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం అవగాహన నిర్వహించారు. అతిథిగా హాజరైన సాంఘికశాస్త్ర ఉపాధ్యాయుడు డోల నాగరాజు మాట్లాడుతూ విద్యార్థులు కళాశాలల్లో చదువుకుంటున్నప్పుడే సేవా కార్యక్రమాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. అలాగే పుస్తకపఠనం అలవాటు చేసుకోవాలని సూచించారు. అనంతరం ఆశయ సంస్థ సమకూర్చిన నీతి కథల పుస్తకాలను విద్యార్థినులకు అందజేశారు. ఆశయ సంస్థ అధ్యక్షుడు రెడ్డి రమణ తదితరులు పాల్గొన్నారు.

కళాకారులకు ప్రోత్సాహం



మహిళలకు చిరతలు అందజేస్తున్న దాత రమణమూర్తి

వేపాడ: మండలంలోని ముకుందపురంలో కోలాటం నేర్చుకుంటున్న మహిళలను ప్రోత్సహిస్తూ పాటూరు గ్రామానికి చెందిన రమణమూర్తి చిరతలను ఆదివారం అందజేశారు. కోలాటం పూర్తిస్థాయిలో నేర్చుకున్న తర్వాత యూనిఫాం అందజేస్తామని దాత తెలిపారు. దాతకు మహిళలు కృతజ్ఞతలు తెలిపారు.

రక్తదానం

నెల్లిమర్ల: సాధన యువజన సంఘ సభ్యులు ఆదివారం రక్తదానం చేశారు. విజయనగరం సర్వజన ఆస్పత్రి బ్లడ్‌బ్యాంక్‌లో సేవా పక్వాడా కార్యక్రమంలో భాగంగా మేము సైతం అంటూ జరజాపుపేటకు చెందిన సాధన యువజన సంఘం సభ్యులు రక్తదానం చేసి పలువురికి ఆదర్శంగా నిలిచారు. దేశ ప్రధాని పుట్టిన రోజు సందర్భంగా సామాజిక చైతన్యంతో సాధన యువజన సంఘ సభ్యులు రక్తదానం చేయడంపై పలువురు అభినందించారు. ఈ సందర్భంగా సాధన అధ్యక్షుడు పి. దుర్గాప్రసాద్ మాట్లాడుతూ, ప్రతిఒక్కరూ రక్తదానం వైపు మొగ్గు చూపాలని విజ్ఞప్తి చేశారు.

ఇంటర్ ఫెయిల్ విద్యార్థులకు రీ ఎన్‌రోల్ అవకాశం

చీపురుపల్లి: గతంలో ఇంటర్మీడియట్ పరీక్షలు రాసి ఫెయిల్ అయిన విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం ఇంటర్మీడియట్ విద్యాశాఖ ద్వారా శుభవార్త ప్రకటించిందని స్థానిక జీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మద్దలి వినోద్‌బాబు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాల్లో బ్యాక్‌లాగ్స్ ఉండిపోయిన విద్యార్థులు తిరిగి రీఎన్‌రోల్ అయ్యి పరీక్షలు రాసుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పిస్తోందని పేర్కొన్నారు. గతంలో ఏ కళాశాలలో చదివినప్పటికీ తాజాగా సమీపంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ద్వారా రీఎన్‌రోల్ అయ్యి పరీక్షలు రాసుకోవచ్చని పేర్కొన్నారు. 2023 అక్టోబర్ 3లోగా సమీపంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ద్వారా ఎలాంటి అపరాధ రుసుము లేకుండా ఫీజు చెల్లించి రీఎన్‌రోల్ చేసుకోవచ్చని స్పష్టం చేశారు. విద్యార్థులు పూర్తి వివరాలకు కళాశాల వేళల్లో తమను సంప్రదించాలని సూచించారు.

సస్యరక్షణతో అధిక దిగుబడి

- వరి పంటను ఆశిస్తున్న పొడ,ఆకుముడత తెగుళ్లు
- నివారణ చర్యలు చేపట్టాలని వ్యవసాయ అధికారుల సూచన



బొండపల్లి సమీపంలో వరి పంటకు పురుగు మందు పిచికారీ చేస్తున్న రైతు

బొండపల్లి: వరి సాగులో రైతులు చేపట్టే సస్యరక్షణ చర్యలపై దిగుబడులు ఆధారపడి ఉంటాయని గజపతినగరం సబ్ డివిజన్ ఏడీఏ కె.మహరాజన్ అన్నారు. వర్షాలు సమయానికి కురవడంతో ఈఏడాది ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి గజపతినగరం సబ్ డివిజన్ పరిధిలోని గజపతినగరం, బొండపల్లి, దత్తిరాజేరు,మెంటాడ మండలాల్లో రైతులు వరి నాట్లు సకాలంలో పూర్తి చేశారు. దత్తిరాజేరు,మెంటాడ మండలాల్లో వరి సాధారణ సాగు విస్తీర్ణం కంటే అధికంగా సాగు చేస్తున్నారు. వరి పంటను ప్రస్తుతం పొడ, ఆకుముడత తదితర తెగుళ్లు ఆశిస్తున్నాయని, నివారణ చర్యలు చేపట్టాలని రైతులకు వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. వరి నాట్లు వేసిన నెల రోజుల వ్యవధి నుంచి 40 రోజుల్లో సాధారణంగా పొడ తెగులుతో పాటు,ఆకు ముడత తెగులు ఆశించే అవకాశం ఉంది.

పొడ తెగులు

నారు నుంచే ఈ తెగులు పంటకు వచ్చే అవకాశం ఉంది.ఈ తెగులు ఆశిస్తే వరిపైరు పూర్తిగా ముదురు గోదుమ రంగులోకి మారిపోయి రెమ్మలు ఎండి పోతాయి నివారణకు 2 మిల్లీ గ్రాముల హెక్సాక్రొనజోల్, లేదా 1 మిల్లీ గ్రాము ప్రొపికొనజోల్ మందును లీటర్ నీటికి కలిపి 15 రోజులు వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేసుకోవాలి.

ఆకు ముడత తెగులు

లద్దె పురుగు వృద్ధి కారణంగా ఈ తెగులు పంటను ఆశిస్తుంది. వరి రెమ్మలు రెండు అంచులను కలిపి గొట్టంలా చేసి మధ్యలో పురుగు ఉంటుంది. రెమ్మలపై తెల్లని చారలు ఏర్పడి క్రమంగా పైరు ఎండి పోతుంది. నివారణకు 1.5 గ్రాముల ఎసిఫేట్ మందును కానీ, కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 50 డబ్ల్యూపీ మందును 2 గ్రాములను కానీ లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి. అలాగే కార్టాప్‌హైడ్రోక్లోరైడ్ 4జీ గుళికలను ఎకరానికి 8 కిలోలను ఇసుకలో కలిపి జల్లడం ద్వారా తెగులును నివారించవచ్చు.

నానో యూరియాతో ప్రయోజనం

రైతులు గుళికలు రూపంలో లభిస్తున్న యూరియా కన్నా ద్రవ రూపంలో లభిస్తున్న నానో యూరియాను వరి పంటపై పిచికారీ చేయడం ద్వారా తక్కువ ఖర్చుతో పంటకు కావాల్సిన నత్రజనిని అందించవచ్చని వ్యవసాయ అధికారుల తెలిపారు. నానో యూరియాను పంటలకు పిచికారీ చేయడం ద్వారా వాతావరణ కాలుష్యాన్ని తగ్గించవచ్చని, భూసారాన్ని కాపాడవచ్చని చెబుతున్నారు. పంట పొట్ట దశలో పొటాష్ ఎరువును 15 నుంచి 20 కిలోలు ఎకరానికి వేయాలని సూచిస్తున్నారు.

గజపతినగరం సబ్ డివిజన్ పరిధిలో వరి సాధారణ, సాగు విస్తీర్ణం వివరాలు హెక్టార్లలో..		
మండలం	సాధారణ విస్తీర్ణం	సాగు విస్తీర్ణం
గజపతినగరం	3,630	2,800
బొండపల్లి	2,813	2,040
మెంటాడ	2,964	3,250
దత్తిరాజేరు	2,483	2,769

యూరియా వినియోగం తగ్గించాలి

రైతులు విచ్చలవిడిగా యూరియాను వేయకుండా అవసరం మేరకే వేయాలి. ప్రస్తుతం వరి పంటను ఆశిస్తున్న తెగుళ్ల నివారణకు వ్యవసాయ సిబ్బంది సూచనల మేరకు పురుగు మందులను పిచికారీ చేయాలి. రైతులు గుళికలు రూపంలో లభించే యూరియా కాకుండా ద్రవరూపంలో లభిస్తున్న నానోయూరియాను వినియోగిస్తే మేలు.

– కె.మహరాజన్, ఏడీఏ, గజపతినగరం సబ్ డివిజన్